



మూసీ నిర్వాసితులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు బీఆర్‌ఎస్ పార్టీ అండంగా ఉంటుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. కొత్తపేట డివిజన్ పరిధి సత్యనగర్ కాలనీ, జనప్రియ అవెన్యూ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు ఆదివారం ఎమ్మెల్యే ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానికులతో మాట్లాడారు. కొన్ని ఏళ్లుగా ఇక్కడ అన్ని అనుమతులు తీసుకుని నివాసముంటూ రూ. లక్షల్లో ప్రాపర్టీ టాక్స్, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. ఇప్పటికి కొన్ని ఇళ్లపై బ్యాంకులో రుణాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం మా ఇళ్లు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్స్‌లో ఉన్నాయని కూల్చివేస్తారంటూ ప్రచారం జరుగుతోందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ..ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఒక్క ఇంటిని కూడా కూల్చనివ్వనని హామీ ఇచ్చారు. తాను మూసీ చైర్మన్‌గా ఉన్నప్పుడు 2020 మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని చేపట్టి మూసీ బెడ్లపై కొన్ని వేల కోట్ల రూపాయలతో 32 ఎస్టీపీ ప్లాంట్లను ఏర్పాటు చేశామని, ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతామంటే ఊరుకునేది లేదన్నారు. ఇది ప్రజల సమస్య కాబట్టి అన్ని పార్టీలు కలిసికట్టుగా పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జిన్నారం విఠల్ రెడ్డి, జీవీ సాగర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు తోట మహేష్ యాదవ్, సొంటి చంద్రశేఖర్ రెడ్డి, ఉదయ్ గౌడ్ పాల్గొన్నారు.

ఐహెచ్‌ఆర్‌ఓ దక్షిణ భారత్ అధ్యక్షుడిగా కాజిమ్



చంచల్‌గూడ: ఇంటర్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ దక్షిణ భారత్ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు) అధ్యక్షుడిగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సయ్యద్ కాజిమ్ అలీ హష్మీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన శనివారం ఆర్గనైజేషన్ వైస్ చైర్‌పర్సన్ కెప్టెన్ రామ్ ఆర్య చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాజిమ్ అలీ మాట్లాడుతూ.. అనుభవం, నైపుణ్యంతో మానవాళి ప్రయోజనాల కోసం నిజాయితీగా పని చేస్తానన్నారు.

మర్యాదపూర్వక కలయిక



చైతన్యపురి/నాగోలు: కాంగ్రెస్ పార్టీ చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడు బండా సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత అనంతుల సురేందర్‌రెడ్డి ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. చైతన్యపురి, కొత్తపేట ప్రాంత మూసీ నివాసితుల సమస్యల గురించి సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

దుండగుడిని శిక్షించాలి

లింగోజిగూడ: ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహం ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హయత్‌నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భాస్కర్, మహేష్, ఎల్లప్ప, అశోక్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై సమీక్ష

లింగోజిగూడ: బీజేపీ సభ్యత్వంపై బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆదివారం తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. సభ్యత్వ నమోదుకు నాయకులు, కార్యకర్తలు మరింత కృషి చేయాలని సూచించారు.

హయత్‌నగర్‌లో...

కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తన నివాసంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. 45 రోజులలో దేశ వ్యాప్తంగా 9 కోట్ల సభ్యత్వాలు నమోదు అయ్యాయని అతిపెద్ద ప్రజాస్వామ్య పార్టీలలో బీజేపీ ఒకటిగా ఎదిగిందని తెలిపారు. మహేష్, ఎల్లప్ప, సంఘీ అశోక్, గోవింద చారి పాల్గొన్నారు.

మెరుగైన సేవలతోనే వ్యాపారాభివృద్ధి


కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: వినియోగదారులకు మెరుగైన సేవలు అందిచటంతోనే వ్యాపార సంస్థ అభివృద్ధి బాటలో నడుస్తుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని ఎంకే చిట్‌ఫండ్ రెండవ వార్షికోత్సవ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకులు కుందేళ్ల మహేష్‌తో కలిసి కేక్ కట్‌చేశారు. అనంతరం హీరో ఆకాష్ జగన్నాథ్, ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్ వేడుకలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మధు, గంగుల శ్రీధర్‌రెడ్డి రాజిరెడ్డి, ఉమామహేశ్వర్, మల్లేష్‌గౌడ్, గౌర శ్రీనివాస్ పాల్గొన్నారు.







కాలనీ అభివృద్ధికి కృషి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి సౌభాగ్యనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన రత్లవత్ రాము, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం రాము మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని, అందరి సహకారంతో కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు.త్వరలో పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. విద్యారెడ్డి, రజనీకాంత్, అశోక్‌కుమార్, విక్కి, పాండురాజు, సుధీర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం వాసన్ ఐకేర్ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్ష శిబిరానికి స్పందన వచ్చింది. శిబిరంలో పాల్గొన్న వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



'సదర్'ను అధికారికంగా నిర్వహించాలి

సైదాబాద్: అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే సదర్ ఉత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అఖిల భారత యాదవ మహాసభ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మైల్‌కోల్ మహేందర్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం సైదాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకమ్మ, బోనాల పండుగలను రాష్ట్ర పండగలుగా అధికారికంగా నిర్వహించుకుంటున్నామని అన్నారు. అదే తరహా సదర్ ఉత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని గత ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించామని గుర్తు చేశారు. రాష్ట్రంలో 20 శాతం జనాభా ఉన్న యాదవులతో పాటు కులమతాలకు అతీతంగా సదర్ ఉత్సవాన్ని జరుపుకుంటామని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సదర్ పండుగ విశేషాన్ని గుర్తించి రాష్ట్ర పండగగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మహేందర్ యాదవ్, శ్రీశైలం యాదవ్, మాణిక్ యాదవ్, నవీన్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

నాగోలు: రక్తదానం ప్రాణదానంతో సమానమని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మన్సూరాబాద్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్‌ఎల్ఎంఎస్ వారి సహకారంతో నిర్వహించిన రక్తదానం శిబిరాన్ని వాసవి క్లబ్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్ నిర్వహణలో నిర్వహించారు. పరమేశ్వర్ గుప్తా, నాగేశ్వరరావు, నరసింహ, సరాబు అంజిబాబు, భాస్కర్ పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం


స్వాతి

నాగోలు: భర్తతో గొడవ పడి గృహిణి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం. నాగోలు బండ్లగూడ రాజీవ్ స్వగృహ అపార్ట్‌మెంట్ డీ-బ్లాక్‌లో పులి ప్రవీణ్‌కుమార్ భార్య స్వాతితో కలిసి నివాసముంటున్నాడు.శనివారం రాత్రి ఇరువురి నడుమ గొడవ జరగడంతో స్వాతి ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.







పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

సైదాబాద్: పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని చింతల్‌బస్తీలో వీరేంద్రబాబు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ సభ్యత్వ నమోదుకు బస్తీవాసుల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజారంజక పాలనకు ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాలు తీసుకుంటున్నారన్నారు. మహేష్, శ్రీనాథ్, ప్రశాంత్, భీష్మాచారి, మోహన్‌కృష్ణ, మధుమతి, కళ్యాణ్ పాల్గొన్నారు.







